సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 27 । జనవరి । 2023



రాజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ: రాజన్నను గురువారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, ప్రతాప నవీన్ పరిశీలించారు.



మూగజీవాలకు మెరుగైన వైద్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని ఆవునూర్‌లో పశు ఆరోగ్య ఉపకేంద్రానికి గురువారం భూమిపూజ చేశారు. పోతుగల్, బందనకల్ గ్రామాలకు సైతం మంజూరయ్యాయి.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/14.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

70 మంది డ్రైవర్ల రక్తదానం



సిరిసిల్లకల్చరల్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ భారీ రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించింది. జిల్లా రవాణాశాఖతో కలిసి ఆర్టీఏ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది డ్రైవర్లు రక్తదానం చేశారు. సిరిసిల్ల బ్లడ్‌బ్యాంక్ రక్తసేకరణ చేపట్టగా.. దాతలందరికీ కలెక్టర్ సంతకాలతో కూడిన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సొసైటీ జిల్లా అధ్యక్షుడు గుడ్ల రవి, డీటీవో కొండల్‌రావు, వాహనాల తనిఖీ అధికారి కిశోర్‌చంద్ర, సొసైటీ వైస్‌చైర్మన్ వేణుకుమార్, బుడిమె శివప్రసాద్, నీలి శ్రీనివాస్, గుడ్ల సునీల్, కూనబోయిన వేణు, గుడ్ల వెంకన్న, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి రవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



వేములవాడ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి సత్తు రవీందర్ పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వేములవాడ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి ఆటలపోటీల్లోని విజేతలకు గురువారం బహుమతులు అందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడిసె సదానందం, స్పోర్ట్స్ సెక్రటరీ బొడ్డు ప్రశాంత్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయండి



సిరిసిల్లకల్చరల్: రైతువ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని జిల్లా రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో కంటికి నల్లని గుడ్డ కట్టుకుని నిరసన తెలిపారు. రైతుసంఘం అధ్యక్షుడు సామల మల్లన్న, మంద సుదర్శన్, తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, జంగం అంజన్న, మంత్రి చంద్రన్న, మంద అంజి, శ్రీనివాస్, దుర్గయ్య, పోచయ్య, వెంకటి పాల్గొన్నారు.

అభివృద్ధిలో మేటి

- సంక్షేమ పథకాల్లో టాప్
- ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహం
- మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంతో ముందడుగు
- పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యం
- సమష్టి కృషితో మరింత ప్రగతి
- కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఘనంగా గణతంత్ర వేడుకలు



సిరిసిల్లలోని గాంధీచౌక్ వద్ద జెండా వందనం చేస్తున్న విద్యార్థులు, పట్టణ ప్రముఖులు

సిరిసిల్లటౌన్: మంత్రి కేటీఆర్ దిశానిర్దేశంలో రాజన్నసిరిసిల్ల జిల్లా అభివృద్ధిలో మేటిగా రాణిస్తోందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. గురువారం 74వ గణతంత్ర వేడుకలను కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించారు. ముందుగా కలెక్టర్ పతాకావిష్కరణ చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయులను, రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడం మన విధి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి జిల్లా అభివృద్ధిలో ప్రథమంగా నిలుస్తుందన్నారు. మంత్రి కేటీఆర్ మార్గదర్శకత్వంలో అన్ని రంగాల్లో ముందుకెళ్తోందని పేర్కొన్నారు. రైతుబంధుతో జిల్లాలో పది విడతల్లో 1,28,361 మంది రైతులకు రూ.1,027 కోట్లు పంటల పెట్టుబడికి అందించినట్లు వివరించారు. రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పంట ఉత్పత్తులను నిల్వ చేసేందుకు గోదాములు నిర్మిస్తున్నట్లు చెప్పారు. రూ.73.80 కోట్ల రైతు బీమా చెల్లించినట్లు తెలిపారు. జిల్లాలో 57 క్లస్టర్ల పరిధిలో రైతువేదికలను నిర్మించినట్లు చెప్పారు.

2.52 లక్షల ఎకరాలకు సాగునీరు

కాళేశ్వరం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా జిల్లాలో 55,980 ఎకరాలకు మొత్తంగా 2,52,372 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. శ్రీరాజరాజేశ్వర జలాయశం కేంద్రంగా మధ్యమానేరులో 367 విస్తీర్ణంలో ఆక్వాహబ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,411 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేసినట్లు చెప్పారు. హరితహారం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఊరురా మొక్కలు నాటిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో 1,20,311 మందికి ఆసరా పెన్షన్ వస్తుందని, ప్రతీ నెల రూ.25.90 కోట్లు అందజేస్తుందన్నారు. కల్యాణలక్ష్మీ ద్వారా 19,908 మందికి రూ.182.57 కోట్లు, షాదీముబారక్ ద్వారా 820 మందికి రూ.7.68కోట్ల ఆర్థిక సాయం చేసిందని వివరించారు. జిల్లా ఆస్పత్రిలో రక్తనిధి, మాతాశిశు సంరక్షణ కేంద్రం, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసిందని, పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లాలో 16,074 మంది బాలింతలకు కేసీఆర్ కిట్లు పంపిణీ చేసినట్లు, అదేవిధంగా రెండోవిడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. రూ.64.70 కోట్లతో కలెక్టరేట్‌ను నిర్మించిందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా 172 పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లతో పనులు చేపడుతుందన్నారు. జిల్లాలో 255 గ్రామపంచాయతీలో నర్సరీలు, డంపింగ్‌యార్డులు, కంపోస్టుషెడ్లు, వైకుంఠ ధామాలు, పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

స్వచ్ఛతలో జాతీయస్థాయిలో టాప్

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 సర్వేలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ధరణి పోర్టల్ భూ సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు పెండింగ్, మ్యూటేషన్లు, కోర్టు కేసులు, పలు కేటగిరీల్లో వచ్చిన 33,700 దరఖాస్తులను పరిష్కరించినట్లు తెలిపారు. బతుకమ్మ చీరల ఉత్పత్తితో 15వేల మందికి ఉపాధి దొరికిందన్నారు. శాంతి పరిరక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం ఉత్తమ సేవలు అందిస్తుందన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ చూపిన అధికారులకు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎస్పీ రాహుల్‌హెగ్డే, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, తెలంగాణ పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య ఉన్నారు.



జెండా వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ



జెండా వందనం చేస్తున్న అతిథులు



రాజన్నగుడిపై జెండా ఎగురవేసిన అధికారులు

జెండా ఆవిష్కరించిన ఎస్పీ

సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాయలంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

మువ్వన్నెల రెపరెపలు..

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: సిరిసిల్లలోని గాంధీచౌక్, మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ జిందం కళ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అర్బన్‌బ్యాంకులో చైర్మన్ గాజుల నారాయణ, అంబేద్కర్‌చౌరస్తాలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ గడ్డం నర్సయ్య జాతీయ జెండాలను ఎగురవేశారు.

పార్టీలు..కులసంఘాల ఆధ్వర్యంలో..

డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, నాగుల సత్యనారాయణగౌడ్, కార్మికభవనంలో జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం కార్యదర్శి మూషం రమేశ్, బీజేపీ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, వెలమ సంక్షేమ మండలి అధ్యక్షుడు చిక్కాల రామారావు, పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, తెలంగాణ జాగృతి అధ్యక్షుడ జూపెల్లి నాగేందర్‌రావు, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోరండ్ల రమేశ్, సిరిసిల్ల రచయితల సంఘం అధ్యక్షుడు జనపాల శంకరయ్య, భవన కార్మిక సంఘం అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్ హాజరయ్యారు. జెడ్పీ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, జిల్లా కోర్టులో జడ్జి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వసంతం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సెస్ కార్యాలయంలో చైర్మన్ చిక్కాల రామారావు, డీఈవో రాధాకిషన్, డీఎంఅండ్‌హెచ్‌వో సుమన్ మోహన్‌రావు , డీటీవో కొండల్‌రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావు, మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, ఆర్టీసీ డీఎం మనోహర్ జాతీయ జెండాలు ఎగురవేశారు. వేములవాడ అర్బన్ మండలం నందికమాన్ వద్ద గల వైఎస్సార్‌టీపీ జిల్లా పార్టీ కార్యాలయం ఎదుట పార్టీ జిల్లా అధ్యక్షులు చొక్కాల రాము జాతీయ జెండాను ఎగురవేశారు.



వైఎస్సార్‌టీపీ కార్యాలయం వద్ద..

బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ అఖిల్ మహాజన్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీగా అఖిల్‌మహాజన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అఖిల్ మహాజన్ 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఇప్పటి వరకు ఎస్పీగా విధుల్లో కొనసాగిన రాహుల్‌హెగ్డే నుంచి నూతన ఎస్పీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు తీసుకుంటున్నట్లు శాఖాపరమైన పత్రాలపై సంతకాలు చేశారు. రాహుల్‌హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీపై వెళ్తున్నారు.

ఇంటింటికీ కాంగ్రెస్

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



వేములవాడలో ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

వేములవాడ: కాంగ్రెస్ పార్టీ దేశానికి రక్ష అని, దేశ ప్రజలకు ప్రశాంతతను చేకూర్చుతుందని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ హాత్‌సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికెళ్లి ప్రచారం చేస్తున్నారు. వేములవాడలో గురువారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రజాసమస్యలు తెలుసుకుంటూ రాజీవ్‌గాంధీ యాత్రను చేపట్టినట్లు పేర్కొన్నారు. వాల్‌పోస్టర్లను ఇంటింటికి అతికించారు. సాగారం వెంకటస్వామి, చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్, కొలకాని రాజు, నాగుల రాము, పల్లపు రాజేందర్, వస్తాదు కృష్ణ, నాగుల మహేశ్, మండె రాజు, కూరగాయల ఆగయ్య, వసపర్తి శంకర్, తిరుపతి, భీమ్‌రాజ్, కనకరాజ్, గణేశ్, సాబీర్, రాజు పాల్గొన్నారు.

వసంత పంచమి శోభ



సిరిసిల్లకల్చరల్: వసంత పంచమిని పురస్కరించుకొని జిల్లాలోని పలు పాఠశాలల్లో గురువారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. జిల్లా కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. నిర్వాహకుడు గోగూరి నాగేందర్‌రెడ్డి, రాపెల్లి ముకుందం పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి పెద్దపీట




కట్టలింగంపేటలో పెద్దమ్మగుడికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, ఇతర నాయకులు

- రూ.6కోట్లతో ఆలయాల అభివృద్ధి
- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు

చందుర్తి(వేములవాడ): పురాతన, నూతన ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని మల్యాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం నిర్మాణానికి రూ.36లక్షల పనులకు, కట్టలింగంపేటలో పెద్దమ్మ ఆలయం నిర్మాణానికి రూ.12లక్షలతో చేపట్టే పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలోని పలు ఆలయాల అభివృద్ధికి రూ.6 కోట్ల సీజీఎఫ్ నిధులతో మరమ్మతు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని రైతులు సుభిక్షంగా ఉండాలని ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటితో ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలు తీర్చామన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు త్వరలోనే డబుల్ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ బైరగోని లావణ్య, రుద్రంగి మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఏనుగుల శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, చందుర్తి, సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్‌రావు, చందుర్తి సెస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు, సర్పంచులు గట్టు లక్ష్మీరాజం, ఏనుగుల జమున పాల్గొన్నారు.

పెళ్లికార్డులోనూ ప్రకృతిపై ప్రేమ

కోనరావుపేట(వేములవాడ): సాధారణంగా పెళ్లి కార్డును వివాహం కాగానే ర్యాక్‌లో వేస్తుంటాం. పెళ్లయిన తర్వాత దానితోని ఎలాంటి ఉపయోగం ఉండదు. అలాకాకుండా పెళ్లికి ముందు, పెళ్లయిన తర్వాత కూడా ప్రయోజనాన్ని అందించేలా ప్రత్యేకంగా తయారు చేయించారు మండలంలోని కనగర్తికి చెందిన మంచాల జ్ఞానేందర్. ఫిబ్రవరి 24న జరిగే తన కూతురు శరణ్య వివాహానికి వినూత్న రీతిలో ఆహ్వానపత్రికలు తయారుచేయించారు. పెళ్లి కార్డును మట్టితో కూడిన పాత్రలో పెడితే రెండు రోజుల తర్వాత తులసీ మొక్క ఉద్భవిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు తమవంతు కృషి చేయడానికే ఖర్చు ఎక్కువైన ఈ కార్డును తయారు చేయించామని జ్ఞానేందర్–శ్రీలక్ష్మి దంపతులు పేర్కొన్నారు. తన తండ్రి శంకరయ్య పేరిట చారిటబుల్ ట్రస్ట్ పేరిట సిరిసిల్ల, నిజామాబాద్ జిల్లా, హైదరాబాద్ ప్రాంతాల్లో స్వర్గయాత్ర వాహనాలు అందించారు.



వివాహకార్డు చూపుతున్న జ్ఞానేందర్ దంపతులు

బదిలీల కాలం

- ఉమ్మడి జిల్లాలో ఐపీఎస్‌ల స్థానచలనం
- త్వరలో భారీగా ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లు
- ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బదిలీలు
- జాబితాలో కరీంనగర్ కలెక్టర్ దంపతులూ
- ఐపీఎస్‌ల బదిలీపై ముందే వెల్లడించిన 'సాక్షి' కథనం





ఎల్.సుబ్బారాయుడు- సత్యనారాయణ





రెమా రాజేశ్వరి - చంద్రశేఖర్‌రెడ్డి





అఖిల్ మహాజన్ - రాహుల్ హెగ్డే





భాస్కర్- సింధూశర్మ

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సమయాత్తమవుతోంది. ఈ ఏడాది అంతానికి ప్రభుత్వ కాలపరిమితి ముగుస్తున్న దరిమిలా.. ఎన్నికలకు సిద్ధమవుతోంది. ఈ మేరకు కీలకమైన పరిపాలన, శాంతిభద్రతలు, రెవెన్యూ అధికారుల బదిలీలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి.. స్పష్టంగా చెప్పాలంటే గురువారం తెల్లవారుజామున జరిగిన ఐపీఎస్‌ల బదిలీలు ఉత్కంఠకు తెరదించాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో సమర్థులైన అధికారులను నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం ఇప్పుడే అమల్లో పెట్టింది. ఇదే క్రమంలో రెండుమూడు రోజుల్లో భారీగా ఐఏఎస్‌ల బదిలీల్లోనూ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు అధికారులు బదిలీ అవుతారని ప్రచారం సాగుతోంది.

కొత్త బాసుల వివరాలు ఇవే..!

కరీంనగర్ సీపీ: సుబ్బారాయుడు, సీపీ, కరీంనగర్

గతంలో కరీంనగర్‌లో ఓఎస్డీగా పనిచేసిన అనుభవం ఉంది. అడ్మినిస్ట్రేషన్, నేర పరిశోధనలో మంచి ఆఫీసర్‌గా గుర్తింపు ఉంది. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసిన నరసింహన్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనచేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ సీఎం చంద్రబాబు వద్ద సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేశారు. ఇటీవల ఐపీఎస్‌ల విభజనలో తెలంగాణకు వచ్చారు. నాన్‌కేడర్ ఎస్పీగా ఉన్న సమయంలో 2021 డిసెంబరులో ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. అప్పటి నుంచి డీజీపీ కార్యాలయంలో సీఐడీ విభాగంలో ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీతో కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ స్థానంలో ఉన్న డీఐజీ సత్యనారాయణ రాచకొండ జాయింట్ కమిషనర్‌గా వెళ్లనున్నారు.

రెమా రాజేశ్వరి: డీఐజీ, రామగుండం సీపీ

ప్రస్తుతం నల్లగొండ ఎస్పీగా ఉన్న రెమా రాజేశ్వరి కేరళలోని మున్నార్‌లో జన్మించారు. 2009 ఐపీఎస్ బ్యాచ్ టాపర్. విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారు. ఐపీఎస్‌ల విభజన సమయంలో తెలంగాణ ఆప్షన్ ఇచ్చుకున్నారు. టెక్నాలజీ, న్యాయశాస్త్రంపై పట్టున్న అధికారి. క్షేత్రస్థాయిలో ఇన్ఫర్మేషన్ సేకరించడంలో దిట్ట. 2016లో షాద్‌నగర్‌లో గ్యాంగ్‌స్టర్ నయీం ఎన్‌కౌంటర్ సమయంలో ఆమె మహబూబ్‌నగర్ ఎస్పీగా ఉండటం గమనార్హం. సోషల్ మీడియా ఫేక్ న్యూస్ కట్టడిలో అందెవేసిన చేయి. కోవిడ్ సమయంలోనూ డీజీపీ ఆఫీసు ఆదేశాలతో టీఎస్‌ఎస్‌పీ బెటాలియన్ నుంచి పలు స్పెషల్ ఆపరేషన్లను పర్యవేక్షించారు. 2021 డిసెంబరులో నల్లగొండ ఎస్పీగా నియమితులయ్యారు. ఆ సమయంలో నేరాలను తగ్గించారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపారు. త్వరలో రామగుండం సీపీగా బాధ్యతలు తీసుకుంటారు. అంతకుముందు ఆ స్థానంలో ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి ఐజీగా పదోన్నతి పొందిన విషయం తెలిసిందే.

అఖిల్ మహాజన్, ఐపీఎస్: సిరిసిల్ల ఎస్పీ

2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అఖిల్ మహాజన్ స్వస్థలం జమ్మూ–కశ్మీర్. హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివారు. సర్దార్‌వల్లభ్ భాయ్ నేషనల్ పోలీస్ అకాడమీలో ఐపీఎస్ శిక్షణ పొందారు. కోవిడ్ తొలివేవ్ సమయంలో 2020లో రామగుండం కమిషనరేట్‌లో ట్రైనీ ఐపీఎస్‌గా చేరారు. ఆ తరువాత కమిషనరేట్ అడ్మిన్‌గా, మంచిర్యాల డీసీపీగా బాధ్యతలు నిర్వహించారు. తాజాగా జరిగిన బదిలీల్లో సిరిసిల్ల ఎస్పీగా బాధ్యతలు చేపట్టబోతున్నారు. (ఆ స్థానంలో ఉన్న రాహుల్ హెగ్డే హైదరాబాద్ ట్రాఫిక్‌కి బదిలీ అయ్యారు) కోల్‌బెల్ట్ ప్రాంతంలో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నేరపరిశోధన, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, గంజాయి రవాణా నిర్మూలన, భూకబ్జాదారులకు కళ్లెం వేయడంలో అఖిల్‌కు మంచి మార్కులు పడ్డాయి.

భాస్కర్: జగిత్యాల ఎస్పీ

హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్పీగా ఉన్న భాస్కర్‌ను ప్రభుత్వం జగిత్యాల ఎస్పీగా బదిలీ చేసింది. సూర్యాపేట జిల్లా ఎగ్గిడి భాస్కర్ 2010 గ్రూప్ అధికారి. తొలి పోస్టింగ్ ఉమ్మడి రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో, రెండో పోస్టింగ్ కామారెడ్డి డీఎస్పీగా, మూడో పోస్టింగ్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, నాల్గో పోస్టింగ్ మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీగా, ఇంటలిజెన్సీ ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుత బదిలీల్లో జగిత్యాల జిల్లాకు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఆ స్థానంలో ఉన్న సింధూశర్మను ప్రభుత్వం వరంగల్‌లోని టీఎస్‌ఎస్‌పీ మామూనురు క్యాంపునకు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

బదిలీలపై ముందే చెప్పిన సాక్షి..!

ఉమ్మడి జిల్లాలో లాంగ్‌స్టాండింగ్‌గా ఉన్న ఐపీఎస్ అధికారులు సిరిసిల్ల రాహుల్‌హెగ్డే, జగిత్యాల ఎస్పీ సింధూశర్మ బదిలీ అవుతారని, కరీంనగర్ సీపీ సత్యనారాయణ సైతం ట్రాన్స్‌ఫర్ అవుతారని కూడా 'సాక్షి' ముందే చెప్పింది. వాస్తవానికి సీపీ సత్యనారాయణ బదిలీ ఆకస్మికంగా జరిగిందేమీ కాదు. కుటుంబానికి దూరంగా తానిక్కడ పనిచేయలేకపోతున్నానని, తనను బదిలీ చేయాలని ఆయనే స్వయంగా కోరినట్లు సమాచారం. అదే సమయంలో సత్యనారాయణ ఇక్కడ హుజూరాబాద్ ఉపఎన్నికతోపాటు ఎమ్మెల్సీ జనరల్ ఎలక్షన్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులు ఏదైనా జిల్లాలో జనరల్ ఎలక్షన్ నిర్వహించినా, రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా.. మరో జనరల్ ఎలక్షన్‌కు ఉండకూడదన్న నియమం కూడా ఉంది. ఎన్నికల సమయంలో ఇబ్బంది కాకుండా ప్రభుత్వం కూడా అయన బదిలీవైపే మొగ్గుచూపింది.

త్వరలో ఐఏఎస్‌ల బదిలీలు..!

- అదే సమయంలో కరీంనగర్‌లో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జెడ్పీ సీఈవో ప్రియాంక, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌లకు పదోన్నతి మీద హైదరాబాద్‌కు వెళ్లనున్నారని సమాచారం. జెడ్పీ సీఈవోకు త్వరలోనే ఐఏఎస్ హోదా రానున్న విషయం తెలిసిందే. అదనపు కలెక్టర్ జీవీ శ్యాం ప్రసాద్ లాల్, ఆర్డీవో ఆనంద్ బదిలీ కానున్నారని తెలిసింది.
- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ కాస్త అటూఇటూగా ఏడాదిలోపే విధుల్లో చేరారు. ఆర్డీవో శ్రీనివాస్ మాత్రం మూడేళ్ల కింద వచ్చారు.
- జగిత్యాల కలెక్టర్ గుగులోత్ రవి బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. అలాగే ఆర్డీవో మాధురి స్థానచలనం తప్పేలా లేదు.
- పెద్దపల్లి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బదిలీ అవకాశాలు ఉన్నాయి. డీసీపీ (అడ్మిన్) అఖిలేశ్, పెద్దపల్లి ఇన్‌చార్జి రూపేశ్ స్థానంలో సుధీర్ కేకన్, గైక్వాడ్ వైభవ్ వచ్చిన విషయం తెలిసిందే.

క్లుప్తంగా

జెండావిష్కరణలో నిబంధనల ఉల్లంఘన


బడిలో మధ్యాహ్నం కనిపించని జెండా

కోనరావుపేట(వేములవాడ): మర్తనపేట ప్రాథమిక పాఠశాలలో జెండావిష్కరణలో నిబంధనలు ఉల్లంఘించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉదయం ఎగురవేసిన జెండాను సాయంత్రం 6 గంటల వరకు తీయకూడదు. కానీ పాఠశాలలో మధ్యాహ్నం 2 గంటలకే తొలగించి, వెళ్లిపోయారు. సీఆర్పీ రాజేశ్వర్‌రావు, ఎంఈవో రఘుపతిలను వివరణ కోరగా సాయంత్రం వేళలో మాత్రమే తీయాలని, అంతకుముందు తొలగించరాదని తెలిపారు.

హరితస్ఫూర్తి పురస్కారానికి రమేశ్ ఎంపిక



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన దుంపెన రమేశ్ పర్యావరణ పరిరక్షణ హరితస్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హుస్నాబాద్‌కు చెందిన యువచైతన్య వెల్ఫేర్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 29న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ముస్తాబాద్(సిరిసిల్ల): పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మోహినికుంటకు చెందిన మహ్మద్ చాంద్‌పాషా గురువారం ప్రాణాలు వదిలారు. చాంద్‌పాషా(52) ఈనెల 17న కూలీ పనులకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలైన చాంద్‌పాషా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. పది రోజులపాటు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య జుబేదా, కుమారులు షాదుల్, షారుక్ ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య


మమత మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన వివాహిత ఎలగందుల మమత(29) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేటకు చెందిన ఎలగందుల లక్ష్మి–నర్సయ్యలకు ముగ్గురు కూతుళ్లు. వారి రెండో కుమార్తె ఎలగందుల మమత(29) వివాహం 2014లో దుబ్బాక మండలానికి చెందిన వ్యక్తితో జరిగింది. కాగా అతనితో విడాకులు అయ్యాయి. మళ్లీ పెళ్లి చేయడానికి సంబంధాలు చూస్తున్నప్పటికీ ఆమెకు నచ్చడం లేదు. విడాకుల విషయం తలుచుకుంటూ తరచూ బాధపడుతుండేది. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎల్లారెడ్డిపేట ఎస్సై శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చందుర్తి(వేములవాడ): మర్రిగడ్డలోని పేకాట స్థావరంపై ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి దాడి చేయగా.. ఐదుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.8,300 స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

ఉత్తమ సేవలకు ప్రశంస

రాజన్నసిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో 74వ గణతంత్ర వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్‌హెగ్డేలు ప్రశంసాపత్రాలు అందించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల జిల్లా


జిల్లా ఉద్యానవనాధికారి జ్యోతికి ప్రశంసాపత్రం అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్‌హెగ్డే


శ్రీనివాస్, సర్వేయర్ ఇన్‌స్పెక్టర్


శ్రీనివాసాచారి, సీపీవో


అమరేందర్‌రెడ్డి, నీటిపారుదలశాఖ ఇంజినీర్


సుమన్‌మోహన్‌రావు, డీఎంహెచ్‌వో


ఎ.రవీందర్, డీపీవో


పి.లక్ష్మీరాజం, డీడబ్ల్యూవో


ఈ డిస్ట్రిక్ట్ జిల్లా మేనేజర్ ఆర్.శ్రీనివాస్


బి.ఉపేందర్, సీఐ, సిరిసిల్ల రూరల్


మహేశ్‌రావు, సూపరింటెండెంట్, వేములవాడ ఆస్పత్రి


పి.అనురాధ, లెక్చరర్


సుచరిత, ఏసీడీపీవో


బి.రోజా, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్


కె.వరుణ్, ఏఈ, సిరిసిల్ల మున్సిపల్


పి.నవీన్, టౌన్ ప్లానింగ్, సిరిసిల్ల


రామకృష్ణ, సెస్ ఎండీ


శ్రీనివాస్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్


రామకృష్ణ, ఎంపీడీవో, కోనరావుపేట


శ్రావణ్‌యాదవ్ ఆర్ఎస్ఐ


రాజు, తహసీల్దార్, వేములవాడ


ఉమారాణి, షీటీం ఎస్ఐ


జైపాల్‌రెడ్డి, సర్పంచ్, చెక్కపల్లి

కాకతీయ కాలువలో యువకుడి మృతదేహం

- ఈ నెల 23న ప్రమాదవశాత్తు పడి మృతి
- ఉపాధి పనులపై సోషల్ ఆడిట్‌కు వీఆర్‌పీగా వచ్చిన రామకృష్ణాపూర్‌వాసి


సాయికుమార్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ఉపాధిహామీ పనులపై సోషల్ అడిట్ చేసేందుకు వీఆర్‌పీగా వచ్చిన మామిడి సాయికుమార్(21) ప్రమాదవశాత్తు కాలువలో పడి, మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొడిమ్యాల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ ఈ నెల 21న ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి, సోషల్ అడిట్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న మండల పరిషత్ కార్యాలయం వెనక వైపు కాకతీయ కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సాయికుమార్‌తో సోషల్ ఆడిట్‌కు వచ్చినవారు అతను కనిపించడం లేదని చుట్టుపక్కల వెతికారు. సాయికుమార్ తండ్రి నారాయణగౌడ్‌కు ఫోన్ చేస్తే ఇంటికి కూడా రాలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఉపాధిహామీ ఎస్ఆర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం తాటిపెల్లి వద్ద కాలువలో సాయికుమార్ మృతదేహం లభ్యమైంది. మృతుడి తండ్రి నారాయణ గౌడ్‌కు ఇద్దరు కుమారులు కాగా సాయికుమార్ పెద్ద కొడుకు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.


మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబసభ్యులు

మృతదేహంతో ఆందోళన

జగిత్యాల క్రైం: సాయికుమార్ మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అతని కుటుంబసభ్యులు అప్పగించారు. దీంతో వారు మృతదేహాన్ని జగిత్యాల కలెక్టరేట్ సమీపంలో గల కరీంనగర్ రహదారిపై ఉంచి, ఆందోళన చేపట్టారు. బాధితులకు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముదుగంటి రవీందర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. జగిత్యాల పట్టణ ఎస్సై రహీం, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్‌లు బాధితులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో సాయికుమార్ మృతదేహాన్ని స్వగ్రామం తీసుకెళ్లారు.

ఏఈపై దురుసుగా ప్రవర్తించిన ఎంపీపీ భర్త


వాటర్ బాటిల్ విసిరేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ముద్దసాని సులోచన భర్త శ్రీనివాస్‌రెడ్డి పంచాయతీరాజ్ ఏఈ తిరుపతిపై దురుసుగా ప్రవర్తించిన ఘటన మండలంలో చర్చనీయాంశమైంది. గురువారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా కార్యాలయంలో జెండా ఆవిష్కరణ అనంతరం అధికారులు, నాయకుల మాటామంతి సమయంలో ఏఈతో ఎంపీపీ భర్త మాట్లాడారు. లక్ష్మీపూర్‌లోని వెల్ది ప్రభుత్వాసుపత్రి భవన నిర్మాణ పనుల శంకుస్థాపన విషయమై చర్చించారు. విషయాన్ని దాటవేసే ధోరణిలో ఏఈ సమాధానం ఇవ్వడంతో అసహనానికి లోనైన శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అక్కడే ఉన్న వాటర్‌బాటిల్‌ను టేబుల్ మీదికి విసిరారు. దీంతో ఏఈ పక్క గదిలోకి వెళ్లి, కంటతడి పెట్టుకున్నారు. అధికారులు, నాయకులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

యువకుడి అనుమానాస్పద మృతి


రాజు (ఫైల్)

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన కొమ్మ రాజు(24)బుధవారం రాత్రి కాచాపూర్ నుంచి వడ్కాపూర్ వెళ్లే దారి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతుడి తండ్రి కొమ్మ రాజేశం, పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు రాజు తన పల్సర్ బైక్ బయటకు వెళ్లి ఎంతకు తిరిగిరాలేదు. దీంతో రాజు తమ్ముడు సతీష్, తండ్రితో కలిసి వెదుకుతుండగా, కాచాపూర్ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ పక్కన మృతిచెంది ఉన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తండ్రి పేర్కొన్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.


సంఘటన స్థలంలో రాజు మృతదేహం

ఏఎల్పీలో తప్పిన పెను ప్రమాదం


కూలిపోయిన గ్యాలరీ షెడ్

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వేకువజామున పెను ప్రమాదం తప్పింది. గని ఆవరణలో సర్ఫేస్ చైర్ లిఫ్ట్ సమీపంలోని ఏ2 బెల్ట్ గ్యాలరీ షెడ్ ఒక్కసారిగా కూలిపోయింది. గ్యాలరీ షెడ్ కింది నుంచి నిత్యం వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. అయితే గ్యాలరీ షెడ్ కూలిన సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. షెడ్ ఒక్కసారిగా కుప్పకూడంతో బొగ్గు రవాణాకు అంతరాయం కలిగి పెద్దఎత్తున నష్టం వాటిల్లినట్లు కార్మికులు వాపోతున్నారు. బొగ్గు ఉత్పత్తిపైన ఉన్న శ్రద్ధ రక్షణపై చూపించకపోవడం వల్లే గనిలో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, రక్షణ చర్యలు తీసుకోని సంబంధిత అధికారులపై యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఏఎల్పీలో కార్మికుడికి కరెంట్ షాక్

రామగిరి(మంథని): సింగరేణి ఏపీఏ పరిధి అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్(ఏఎల్పీ)లో గురువారం వై.రామకృష్ణ అనే ఎలక్ట్రీషియన్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. స్థానిక కార్మికుల వివరాల ప్రకారం.. గనిలోని 89వ లెవల్‌లో స్విచ్ వద్ద విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు షాక్ తగలడంతో రామకృష్ణ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన తోటి కార్మికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి రామకృష్ణను పరిశీలించగా అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన గనిపైకి తీసుకువచ్చి సెంటినరీకాలనీలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స పొందిన రామకృష్ణ స్పృహలోకి వచ్చాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామకృష్ణను టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, ఏఎల్పీ ఫిట్ సెక్రటరీ దాసరి మల్లేశ్ పరామర్శించారు.


రామకృష్ణను పరామర్శిస్తున్న నాయకులు

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో మ్యాదరవేని సూరవ్వపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. భూ తగాదా విషయంలో కొల్వాయికే చెందిన మ్యాదరవేని అంజన్న సూరవ్వను గురువారం అసభ్యపదజాల ంతో దూషించాడు. అంతటితో ఆగకుండా కర్రతో ఆమెపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యా దు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఒకరిపై రౌడీషీట్

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామానికి చెందిన చుక్క గంగాధర్‌పై పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. గంగాధర్ ఇప్పటికే 4 క్రిమినల్ కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్న అతనిపై ఉన్నతాధికారులు ఆదేశాలకు రౌడీషీట్ ఓపెన్ చేసి, నిఘా ఉంచినట్లు తెలిపారు.

యువతి అదృశ్యం

సారంగాపూర్(జగిత్యాల): అర్పపల్లికి చెందిన రజిత అనే యువతి అదృశ్యమైనట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రజిత బుధవారం అర్పపల్లి సమీప లక్ష్మీదేవిపల్లిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్లింది. అదేరోజు రాత్రి 10 గంటలకు తిరిగి అర్పపల్లికి బయలుదేరింది. కానీ ఇంటికి చేరలేదు. బాధితురాలి తండ్రి చంద్రమౌళి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెక్కపల్లి.. మూడేళ్లుగా ఉత్తమ జీపీ


చెక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం


రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి (ఫైల్)

- అభివృద్ధి పనుల్లో ఆదర్శం
- గణతంత్ర వేడుకల్లో సర్పంచ్‌కు అవార్డు అందించిన కలెక్టర్
- సత్ఫలితాలనిస్తున్న పంచాయతీ పాలకవర్గ చర్యలు

వేములవాడరూరల్: మండలంలోని చెక్కపల్లిని వరుసగా ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డులు వరిస్తున్నాయి. 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కలెక్టర్ అనురాగ్ జయంతి చేతులమీదుగా సర్పంచ్ అడ్డిక జైపాల్‌రెడ్డి గురువారం అవార్డు అందుకున్నారు. జిల్లాలోనే ఈ పురస్కారానికి ఎంపికైన ఏకైక గ్రామం కావడం విశేషం. మూడేళ్లుగా అవార్డులు వస్తున్నాయని సర్పంచ్ తెలిపారు. గత డిసెంబర్ 29న గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం జీపీ కార్యాలయానికి వెళ్లి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యదర్శి గడ్డం చందన, సర్పంచ్ జైపాల్‌రెడ్డిలను అభినందించారు.

అందరి సహకారం వల్లే..

మా గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు రావడం సంతోషంగా ఉంది. అధికారుల ఆదేశాల మేరకు గ్రామస్తులందరూ పాలనకు సహకరించడం వల్లే పురస్కారం దక్కింది. మూడేళ్లుగా వరుసగా అవార్డు వస్తోంది.
– అడ్డిక జైపాల్‌రెడ్డి, సర్పంచ్, చెక్కపల్లి

గ్రామంలో చేపట్టిన పనులివే..

చెక్కపల్లిలో స్వచ్ఛభారత్ విజయవంతంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కమ్యూనిటీ సోక్‌పిట్స్ పూర్తి చేశారు. గ్రామంలో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించారు. స్వచ్ఛతపై వాల్ పెయింటింగ్స్ వేయించారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లె ప్రగతి, క్రీడాప్రాంగణం, తడి, పొడిచెత్త వేరు చేయడంలో పంచాయతీ పాలకవర్గం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. జాతీయ పంచాయతీ అవార్డు కోసం జిల్లాలోని 53 గ్రామాలను ఎంపిక చేయగా అందులో చెక్కపల్లి కూడా ఉంది.

‘పైరవీ బదిలీలు, పదోన్నతులు మానుకోండి’


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ నాయకులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాల్సిన అధికారులు, పాలకులు వాటిని దొడ్డిదారిన చేపట్టడం సరికాదని యూటీఎఫ్ నాయకులు అన్నారు. గురువారం సిరిసిల్లలో కార్యవర్గ సమావేశం నిర్వహించి, నిరసన తెలిపారు. ప్రభుత్వం బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహిస్తామని చెబుతూనే రంగారెడ్డి జిల్లాలో పైరవీ బదిలీలు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. మన జిల్లాలోనూ ఇద్దరు ఇలానే బదిలీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సర్కారే పారదర్శకతకు పాతరేసి, పైరవీ బదిలీలకు తెరతీస్తే ఉపాధ్యాయులు మౌనంగా ఎలా ఉంటారన్నారు. ఇలాంటి చర్యలు మానుకోకపోతే పోరాటాలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. సీనియార్టీని పరిగణలోకి తీసుకొని, నిబంధనలు పాటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షులు లత, రమేశ్, కోశాధికారి రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేశం, కార్యదర్శులు శివకుమార్, స్వామి, భాస్కర్, సరిత, మల్లేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగుకు స్పందన కరువు

- ప్రచారం చేసినా స్పందించని ప్రజలు


హన్మాజిపేటలో కంటిపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వేములవాడరూరల్: తెలంగాణ ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీనిపై పలు దఫాలు అధికారులు, వైద్యాధికారులకు సూచనలు చేసింది. అయినప్పటికీ ప్రజల నుంచి స్పందన రావడం లేదు. ఈనెల 18న ముఖ్యమంత్రి ప్రారంభించిన ఈ కార్యక్రమానికి అన్ని జిల్లాల్లో 19న ప్రారంభించారు. వేములవాడ మండలంలోని హన్మాజిపేటలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి రోజుకు 250 మంది చొప్పున తప్పనిసరి పరీక్షలు నిర్వహించాలని జిల్లా అధికారులు ప్రత్యేకంగా సూచించారు. కానీ ఇప్పటి వరకు 548 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. 250 చొప్పున 5 రోజులు 1,250 మందికి చేయాల్సి ఉండగా 548 మంది మాత్రమే పరీక్షలకు రాగా వారికి 35 మందికి మాత్రమే కంటి అద్దాలను నిర్వాహకులు అందజేశారు. ఉదయం, సాయంత్రం మైకుల ద్వారా కంటివెలుగు పరీక్షకు రావాలని పదే పదే మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నప్పటికీ పల్లెల్లో జనం కంటి పరీక్షలు చేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని అన్ని వర్గాల్లో తీసుకెళ్లి పరీక్షలు విజయవంతంగా పూర్తి చేయాలని పలు సూచనలు జారీ చేసినప్పటికీ ప్రజల నుంచి మాత్రం ఆశించినంత స్పందన రావడం లేదని వైద్యులు పేర్కొంటున్నారు.

విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రతీ గ్రామంలో కంటివెలుగును నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేసింది. అందులో విధులు నిర్వహించే సిబ్బందిని కూడా ప్రత్యేకంగా అధికారులు కేటాయించారు. మధుప్రవచిని, ఆరోగ్య పర్యవేక్షకులు గంగమరాజు, ఆప్తాల్మిక్ ఆఫీసర్ వినయ్, ఏఎన్ఎం విజయలక్ష్మి, సరస్వతి, కవిత, ఆశ కార్యకర్తలు గౌతమి, ప్రవళితోపాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొంటున్నారు.

జగిత్యాల ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలి

కరీంనగర్‌కల్చరల్: జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ భోగ శ్రావణిని ఇబ్బందులకు గురిచేసి తన రాజీనామాకు కారణమైన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై గవర్నర్ చర్య తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన నిషాని రామచంద్రం డిమాండ్ చేశారు. బహుజన్ సమాజ్ పార్టీ కరీంనగర్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఒక మహిళ చైర్మన్‌ను వేధించడం నీచమైన చర్య అని, ఇది దొరల అహంకారానికి నిదర్శనమన్నారు. గవర్నర్ స్పందించి ఎమ్మెల్యేపై చర్య తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నల్లాల శ్రీనివాస్, కరీంనగర్ జోనల్ మహిళా కన్వీనర్ స్వరూప, జిల్లా కార్యదర్శులు బడుగు నరేష్, మంద రవీందర్, టౌన్ అధ్యక్షుడు ఆస్తపురం మధు, అసెంబ్లీ మహిళా కన్వీనర్ అల్లూరి అనురాధ, రామడుగు కుమార్, రోమాల రాజు, స్వామి, మంద బాలయ్య, బండపల్లి శ్రీకాంత్, విష్ణు తదితరులున్నారు.

చేతబడి అనుమానంతో చంపేశారు..

- మల్లాపూర్ వృద్ధుడి హత్య కేసులో ముగ్గురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రానికి చెందిన నూతికట్టు గంగారాం(62)ను చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో హత్య చేశారని మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ముగ్గురు నేరస్తులను అరెస్టు చేశామన్నారు. గురువారం మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మల్లాపూర్‌కు చెందిన పిల్లి సత్యనారాయణ, ముద్దం నరేష్‌లు కొంతకాలంగా అనారోగ్యంతో ఆసుపత్రి పాలుకావడం, కుటుంబాల్లో అనేక సమస్యలకు గంగారాం చేతబడి చేయడమే కారణమని వారు అనుమానించారు. అతన్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం ఈ నెల 16న అర్ధరాత్రి ఎల్లాల గోవర్ధన్‌తో కలిసి గంగారాం గొంతునులిమారు. చనిపోయాడని భావించి, బైక్‌పై గ్రామ శివారులోని కోపిగుట్ట వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో వృద్ధుడిలో కదలికను గమనించి, పెద్ద బండరాయితో ముఖంపై మోది, హత్య చేశారు. మృతదేహాన్ని ఉపాధిహామీ గుంతలో పూడ్చిపెట్టారు. పైపైన పూడ్చడంతో ఆ మృతదేహాన్ని ఈ నెల 21న అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించారు. వీఆర్‌ఏ ఎస్సై నవీన్‌కుమార్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి వెళ్లి, పరిశీలించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు మృతదేహాన్ని బయటకు తీయగా గంగారాందేనని అతని తమ్ముడి కుమారుడు రవి గుర్తించాడు. హత్యకు గురైనట్లు తేల్చిన పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు అనుమానితులు సత్యనారాయణ, నరేష్, గోవర్ధన్‌లను అదుపులోకి తీసుకొని, విచారణ జరుపగా తామే హత్య చేసినట్లు ఒప్పుకున్నారు. దృశ్యం సినిమాలో మాదిరిగా వృద్ధుడి గంగారాం దుస్తులను నరేష్ తన ఇంటి వెనకాల కాల్చివేశామన్నారు. ఫోన్‌ను మెట్‌పల్లి బస్టాండ్‌లో నిజామాబాద్ వెళ్లే ఆర్టీసీ బస్సులో పడేశామని, తర్వాత తిరిగి మల్లాపూర్ వచ్చినట్లు పేర్కొన్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి, హత్యకు వినియోగించిన ద్విచక్రవాహనం, బండరాయి, పారను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. వారిని కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.